క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని రాట్నాలపల్లిలో ఆదివారం బీరప్ప స్వామి విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు రూ.50 వేలు విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. అలాగే ఎంపీపీ కె.రమణారెడ్డి రూ.10 వేలు, టీచర్ సూర్య నారాయణ రెడ్డి రూ.10 వేల చొప్పున విరాళం అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి కుటుంబ సభ్యులకు బీరప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి, నాయకులు సానే హరినాథ్ రెడ్డి, వై.హరినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, మహేశ్వర, శివన్న, రాజారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి

నల్లమాడ: కొండ్రవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జి.గంగులప్ప (39) అనారోగ్యంతో శనివారం బెంగుళూరులోని ఆస్పత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తండ్రి, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి గ్రామానికి వెళ్లి గంగులప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. దహన సంస్కారాలకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, నాయకులు ఎం.పెద్ద గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, దుద్దుకుంట వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శంకర్‌నాయక్, షంషీర్, చంద్రహాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వడ్డెర కులస్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సెరికల్చర్ కార్యాలయం సమీపంలో ఆదివారం వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ఆదివారం భూమిపూజ చేశారు. వడ్డెర కులస్తులు డేరంగుల అంజి, ఆలకుంట్ల పోతలయ్య, సుబ్రహ్మణ్యం, తోపుదుర్తి వెంకట్రాముడు, వల్లపు అనిల్, డేరంగుల రాజేష్, మంజుల సత్యనారాయణ, బండ్లపల్లి రాజు, నారాయణస్వామి, రమేష్, రవి, రోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట ఎస్‌ఐగా నంద్యాల క్రిష్ణవేణి



గాండ్లపెంట: గాండ్లపెంట ఎస్‌ఐగా నంద్యాల క్రిష్ణవేణి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అనంతపురంలో జిల్లా ట్రైనింగ్ కేంద్రంలో పని చేస్తూ బదిలీపై సత్యసాయి జిల్లాకు రాగా అక్కడి నుంచి గాండ్లపెంటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. శాంతిభద్రల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఇంటి గోడల ధ్వంసం



పునాదికి వేసిన కడ్డీలను తొలగించిన దృశ్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ఓ వ్యక్తి నూతనంగా కడుతున్న ఇంటి గోడలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వివరాలు.. విజయ్‌భాస్కర్‌రెడ్డి శనివారం ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఇంటి గోడలకు ఉన్న ఇటుకలు, పునాదికి వేసిన కడ్డీలను గుర్తు తెలియని తొలగించారు. బాధితుడు పుట్టపర్తి రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ క్రిష్ణమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. మరోసారి ఘటన జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పథంలో చారుపల్లి

- సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటుతో ఇంటి ముంగిటకే అందుతున్న సేవలు
- పథకాల ద్వారా రూ.22,98,66,118 లబ్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేయడంతో ప్రజలు, రైతులకు మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా పోయింది. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సచివాలయంలోనే దరఖాస్తు చేస్తున్నారు. భూ సమస్యలతో పాటు విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను సైతం సచివాలయంలోనే అందిస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, మందులు రైతు భరోసా కేంద్రంలో అందిస్తున్నారు. ఉన్న ఊళ్లోనే అన్ని పనులు జరిగిపోతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చారుపల్లిలో అన్ని హంగులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



సీ.రెడ్డివారిపల్లి వరకూ నిర్మించిన సీసీ రోడ్డు

నల్లమాడ: మండల కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో విసిరేసినట్లుగా ఉండే చారుపల్లి పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. పంచాయతీ పరిధిలో చారుపల్లి, సీ.బడవాండ్లపల్లి, సీ.రెడ్డివారిపల్లి, పోలంవాండ్లపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం 900 కుటుంబాలు ఉండగా.. దాదాపు నాలుగు వేల జనాభా ఉంది. గతంలో ఏ అవసరం వచ్చినా ఇటు 18 కిలోమీటర్లు, అటు 16 కిలోమీటర్లు దూరంలో ఉండే నల్లమాడ, కదిరికి వెళ్లాల్సి వచ్చేది. సీ.రెడ్డివారిపల్లికి సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. గ్రామంలో 200 కుటుంబాలు, వెయ్యికి పైగా జనాభా ఉంది. మట్టిరోడ్డు కంకర తేలి, మోకాళ్ల లోతు గుంతలతో అస్తవ్యస్థంగా తయారు కావడంతో రాకపోకల కోసం నానా అవస్థలు పడ్డారు. చారుపల్లి నుంచి ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తీసుకెళ్లాలంటే పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. టీడీపీ హయాంలో రోడ్డు నిర్మాణమంటూ పలు దఫాలు శంఖుస్థాపనలు చేశారే తప్ప రోడ్డు నిర్మించిన పాపాన పోలేదు. అయితే సీఎం జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. తమ చిరకాల రోడ్డు కల నెరవేరిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రూ.1.10 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణం

సీ.రెడ్డివారిపల్లి గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రూ.1.10 కోట్లతో గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయించారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) సహకారంతో చారుపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి సీ.రెడ్డివారిపల్లి వరకు 1.2 కిలోమీటర్లు సీసీ రోడ్డు నిర్మించారు. రహదారి మధ్యలో వాగుపై బ్రిడ్జి కూడా నిర్మించారు.

పథకాలన్నీ అందాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయి. మా పెద్ద కుమారుడికి మూడేళ్ల పాటు అమ్మ ఒడి పథకం కింద రూ.45 వేల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ వాహన మిత్ర కింద నాకు మూడేళ్లకు రూ.30 వేలు అందాయి. తాజాగా ప్రభుత్వం మంజూరు చేసిన గృహం నిర్మించుకోగా బిల్లు మొత్తం చేతికందింది. పేదలకు అన్ని రకాలుగా సాయం అందిస్తున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– డీ.బాబు, చారుపల్లి

రోడ్డు కల సాకారం



ఏడాది క్రితం వరకూ మా గ్రామానికి రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఆటోలు కూడా వచ్చేవి కావు. అకస్మాత్తుగా అనారోగ్యానికి గురైతే ఆస్పత్రులకు వెళ్లేందుకు గ్రామస్తులు అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చారుపల్లి నుంచి రెడ్డివారిపల్లి వరకు 1.2 కిలోమీటర్లు సిమెంట్ రోడ్డు వేశారు. వంకపై బ్రిడ్జి కూడా నిర్మించారు. ఇప్పుడు రాకపోకలకు చాలా సౌకర్యంగా ఉంది. ఈ ప్రభుత్వ పాలన బాగుంది.

– పీ.శకుంతలమ్మ, సీ.రెడ్డివారిపల్లి

రేపు సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పర్యటన

ఎన్‌పీకుంట: వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీ.ఎస్.మక్బూల్ అహ్మద్ మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, సీనియర్ నాయకుడే బాలకృష్ణ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 7 గంటలకు మండల పరిధిలోని గౌకనపల్లి పంచాయతీ కమ్మగుట్టపల్లిలో నాయకులు, కార్యకర్తలతో మక్బూల్ అహ్మద్ సమావేశం అవుతారన్నారు. అక్కడి నుంచి టీ.ఎస్.పల్లి, మరికొమ్మదిన్నె పంచాయతీలతో పాటు మరికొన్ని గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, డైరెక్టర్లు, చైర్మెన్లు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. తొలిరోజు బోటనీ ప్రాక్టికల్స్ జరిగాయి. 21 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 20 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ కవిత తెలిపారు.

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బోటనీ ప్రాక్టికల్స్‌కు 33 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 31 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలన్నారు.

కన్యకా పరమేశ్వరీ.. నమోస్తుతే



నల్లచెరువు: అలంకరణలో వాసవీ మాత



కదిరి టౌన్: కలశాలతో గ్రామోత్సవం

నల్లచెరువు: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆర్యవైశ్యులు అమ్మవారిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. హోటల్ బాబు, రేఖ దంపతులు ఆలయ ప్రాగణంలో గణపతిపూజ, గణపతి హోమం, వాస్తు హోమం, వాసవీ హోమం, పూర్ణాహుతి, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

తాడిమర్రి: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆర్యవైశ్య ముత్తైదువులు 101 కలశాలతో స్థానిక వీరభద్రయ్యస్వామి దేవాలయం నుంచి పవిత్ర గంగా జలాన్ని తెచ్చారు. ప్రధాన వీధుల్లో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌ను గంగా జలంతో అభిషేకించి, వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, వివిధ పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు.

కదిరి టౌన్: పట్టణంలో కన్యకా పరమేశ్వరీ ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. 21 మంది కన్యలతో పూజలు నిర్వహించారు.అమ్మవారిని కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడా వరప్రసాద్, కార్యదర్శి ఆనందబాబు, దీక్ష సభ్యులు శేషు, బాలాజీ, వెంకటేష్, రాఘవేంద్ర సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



తాడిమర్రిలో వాసవీమాత ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

లక్ష్య సాధనకు శ్రమించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్, ఎంఈఓ గోపాల్‌నాయక్

ధర్మవరం: విద్యార్థులందరూ లక్ష్యాన్ని ఏర్పరచుకుని నిరంతరం శ్రమించాలని అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్, ఎంఈఓ గోపాల్‌నాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీసీఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, హరినాథ్, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

టీ కొట్టు దగ్ధం

సోమందేపల్లి: మండలంలోని బ్రహ్మణపల్లిలో బాబా ఖాన్‌కు చెందిన టీ కొట్టుకు దుండగులు ఆదివారం తెల్లవారుజామున నిప్పుపెట్టారు. స్థానికులు గమనించి, మంటలు ఆర్పివేశారు. కొట్టులోని ఆహార పదార్థాలు, ఇతర సామగ్రి దగ్ధమయ్యింది.

నిత్యావసర సరుకుల పంపిణీ



మాట్లాడుతున్న ఐఎఫ్‌సీఓ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్

నల్లమాడ: మండలంలోని కుటాలపల్లి, రెడ్డిపల్లి, వంకరకుంట, సానేవారిపల్లి, రెడ్డికుంట తండా గ్రామాల్లో ఐఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఐఎఫ్‌సీఓ సంస్థ రాష్ట్రంలో రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధికి ఎన్నో సహాయ, సహకారాలు అందిస్తోందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళల స్వయం సమృద్ధికి, జీవనోపాధికి వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ, పరిశ్రమల స్థాపనకు సంస్థ సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా మేనేజర్ వల్లూరి స్వామి, అడ్మిన్ మేనేజర్ శ్యాం, రీజనల్ మేనేజర్ హుస్సేన్ వలీ, డీపీఆర్‌ఓలు సుంకన్న, జయన్న, డివిజనల్ మేనేజర్ మహమ్మద్ రఫీ, సంధ్యారాణి, డీలర్లు అశోక్‌రెడ్డి, శారద, పీరు నాయక్, మంజుబాయ్, సరళ, రాజేశ్వరి, గాయిత్రి, నరసింహ, అనిత, అమర్ పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు



అనంత సాగరంలో పర్యటిస్తున్న పోలీసులు

బత్తలపల్లి: త్వరలో రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మాల్యవంతం, అనంతసాగరం గ్రామాల్లో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లో మద్యం, గుట్కాను విక్రయించేవారి ఇళ్లతో పాటు రౌడీషీటర్లుగా పోలీసుల రికార్డులలో నమోదైన వారి ఇళ్లు, అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. ప్రజలు కలిసిమెలిసి జీవించాలన్నారు. అనవసర విషయాల్లో తలదూర్చి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ఎన్నికల వరకూ రాజకీయాలు చేసుకోవాలని ఆ తరువాత ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. వ్యక్తిగత ఘర్షణలు, గొడవలకు దారి తీసేలా ప్రవర్తించవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు తిరుపాలు, సోమశేఖర్‌మూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

మాల్యవంతంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పర్యటన

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం గ్రామంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోమవారం పర్యటిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

గాండ్లపెంట: మండల పరిధిలోని గొడ్డువెలగల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు జేసీఎస్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహమ్మద్ హాజరవుతారన్నారు. మండలంలోని నాయకులు, సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల, జిల్లా కో–ఆప్షన్ సభ్యులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సచివాలయ ప్రారంభోత్సవం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కేఎస్ పాళెంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించనున్నారు. ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో కోరాయి.

కర్ణాటక మద్యం పట్టివేత

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పవన్ కుమార్ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 12 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు.

14న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

కనగానపల్లి: మామిళ్లపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 14న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె.లోకనాథరెడ్డి తెలిపారు. ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు ఆలయం ముందు నాగుల ప్రతిష్ట కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు



అలంకరణలో పెద్దమ్మ దేవత

తాడిమర్రి: స్థానిక పెద్దమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ పూజారి దేవమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

మైలసముద్రంలో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీలో చేరిన 20 టీడీపీ కుటుంబాలు

పుట్టపర్తి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్తచెరువు మండలం మైలసముద్రంలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం పుట్టపర్తి పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాగేంద్ర నాయుడు, బాషా, కేశవ్, జయమ్మ, రామచంద్ర, ప్రమీల, పోతలయ్య, రాజు, కార్తీక్, రాధమ్మ, లక్ష్మమ్మ, నాగమ్మ, హాజీర, బాబు, రహిమాన్‌బీ, ఖాను, ముబీనా, సాయికిరణ్ తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బూత్ లెవల్ కమిటీ కో–కన్వీనర్ గోపాల్‌రెడ్డి, గోవిందరెడ్డి, వైస్ సర్పంచ్ కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 65 మంది ఎంపిక



వైద్యులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు, దాతలు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరం పేద ప్రజలకు ఊరటనిస్తోందని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, క్యాంపు చైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటిచూపు తగ్గిన వారికి బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. వైద్య శిబిరం దాతలుగా మామిళ్ల రంగప్ప జ్ఞాపకార్థం కుమారుడు మామిళ్ళ తులసి ప్రసాద్, కోడలు మాధవి వ్యవహరించారు. ఈ వైద్య శిబిరంలో 125 మంది కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 65 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. అనంతరం క్యాంపు దాతలతో పాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామకృష్ణ, శంకర్ కంటి ఆసుపత్రి కో–ఆర్డినేటర్ శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కదిరి టౌన్: ఎస్సీల వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలపడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగిన మాదిగల విశ్వరూప మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాని నరేంద్రమోదీ మాదిగలకు అండగా నిలబడతానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర కేబినెట్ సెక్రటరీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు కమిటీ కార్యాచరణ వేగవంతం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఆనంద్, రమణ, ఆంజనేయులు, శ్రీనివాసులు, విశ్వనాథ్, నాగరాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.